## క్లుప్తంగా

### కూరగాయల విత్తనాలు పంపిణీ



రైతులకు కూరగాయల విత్తనాలు అందజేసిన దృశ్యం

హిందూపురం టౌన్: సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోళ్లాపురంలో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ దేవరాజు రైతులకు సొరకాయ, బీరకాయ, వంకాయ, టమాట, గుమ్మడికాయ, బెండకాయ, మిరపకాయ, ముల్లంగి, కాకరకాయ తదితర రకాల విత్తనాలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉమామహేశ్వరి, వీఆర్‌ఓ అశ్వర్థప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ‘తొగట వీర క్షత్రియ’ నూతన కమిటీ ఎన్నిక



ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

సోమందేపల్లి: తొగట వీర క్షత్రియ సేవా సమితి నూతన కమిటీని శుక్రవారం లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మంటపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సీసీ హరి, ఉపాధ్యక్షులుగా పామిషెట్టి గోపి, శ్రీనివాసులు, రామాంజి, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మహేంద్ర, సహాయ కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా మంజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, నాయకులు వెంకట రాముడు, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

### ఐసీడీఎస్ పీడీకి సన్మానం



ఐసీడీఎస్ పీడీని సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ నాగమల్లేశ్వరి శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా దొడ్డేరి, ఎం.రాయాపురం తదితర క్లస్టర్ల పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది పీడీని ఘనంగా సన్మానించారు. పీడీ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలన్నారు.

### వైభవంగా గౌరీవ్రతం



గౌరీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

మడకశిర: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆషాఢ గౌరీ వ్రతాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్యమహిళా మండలి ఆధ్వర్యంలో ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు.

### ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టండి



హౌసింగ్ అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: నియోజకవర్గంలో త్వరితగతిన ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆమె హౌసింగ్ అధికారులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండలాల వారీగా నిర్మిస్తున్న ఇళ్ల వివరాలు, పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, బిల్లులు, మెటీరియల్ ఏమేరకు చెల్లించారన్న విషయాలపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని, వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

### త్వరలో పెనుకొండలో డీఎస్సీ కోచింగ్

పెనుకొండ: త్వరలోనే పట్టణంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ నేపథ్యంలో నిరుద్యోగుల కోసం కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 200 మందికి శిక్షణ ఇస్తామని, వారికి ప్రతి నెలా రూ.1500 స్టైఫండ్, రూ. వెయ్యి స్టేషనరీ ఖర్చుల కింద ఇస్తామన్నారు. అలాగే ఇస్కాన్ ఆధ్వర్యంలో పెనుకొండ కొండపై 108 అడుగుల లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ఏర్పాటుకు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# కరుణించని వరుణుడు

- వర్షాభావంతో పూర్తిస్థాయిలో వేరుశనగ సాగు చేయని రైతులు
- 16,110 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగు
- ప్రత్యామ్నాయ పంటల వైపు అన్నదాతల చూపు
- సాగు చేసిన వేరుశనగ కూడా వాడుతున్న వైనం



మడకశిర సమీపంలో ముందుగా సాగు చేసిన వేరుశనగ పంట వాడుతున్న దృశ్యం

| | |
|---|---|
| మడకశిరలో సాధారణ వేరుశనగ విస్తీర్ణం | 26,472 హెక్టార్లు |
| ప్రస్తుతం సాగైన విస్తీర్ణం | 16,110 |
| ఇంకా సాగుకు నోచుకోని విస్తీర్ణం | 10,362 |

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో సమయానికి వరుణదేవుడు కరుణించలేదు. దీంతో వేరుశనగ సాగు పూర్తిస్థాయి విస్తీర్ణానికి నోచుకోలేదు. ముంగారులో వర్షాలు ప్రారంభంలో బాగానే వచ్చినా ఆ తర్వాత అదును వర్షం పడలేదు. తుంపర వర్షం కురువడంతో వేరుశనగ సాగుకు అదును కుదరలేదు. దీంతో ఆశించినస్థాయిలో వేరుశనగ పంట సాగులోకి రాలేదు.

**వర్షాభావంతో తగ్గిన సాగు విస్తీర్ణం**

ఈ ఏడాది నియోజకవర్గంలో ఇంత వరకూ 16,110 హెక్టార్లలోనే వేరుశనగ పంట సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 26,472 హెక్టార్లకు గాను 16,110 హెక్టార్లలో మాత్రమే రైతులు పంట పెట్టారు. 10,362 హెక్టార్లలో పంటను పెట్టలేకపోయారు. వర్షాలు రాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

**ముగిసిన గడువు**

వేరుశనగ సాగుకు గడువు ముగిసింది. జూలై 15లోగా పంట పెడితేనే దిగుబడి పూర్తిస్థాయిలో వస్తుంది. ఆ తర్వాత పంట సాగు చేస్తే దిగుబడి ఏమాత్రం ఉండదు. రైతులు పూర్తిస్థాయిలో నష్టపోవాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారులు ఈనెలాఖరు వరకు వేరుశనగ సాగు చేసుకోవచ్చని చెబుతున్నారు రైతులు మాత్రం పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు.

**ప్రత్యామ్నాయ పంటల వైపు ..**

నియోజకవర్గంలో రైతులు వేరుశనగ పంట సాగుపై ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆశలు వదులుకున్నట్లే. ప్రస్తుతం రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఇంత వరకూ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై దృష్టి సారించలేదు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సరఫరా చేయడానికి చర్యలు చేపట్టలేదు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం జూలై ఆఖరు వరకూ చూసి ప్రత్యామ్నాయ పంటల విత్తనాల సరఫరాపై దృష్టి పెడతామని చెబుతున్నారు.

**వాడుపట్టిన వేరుశనగ**

నియోజకవర్గవ్యాప్తంగా ఈఏడాది ఖరీఫ్‌లో ముందుగానే రైతులు వేరుశనగ పంటను సాగు చేశారు. ప్రారంభంలో వర్షాలు అనుకూలించడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. దాదాపు 8 వేల హెక్టార్లలో వేరుశనగ పంటను ముందస్తుగా రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంటకు వర్షాలు అవసరం. అయితే గత నెల రోజుల నుంచి పెద్ద వర్షం రాకపోవడంతో ఈ పంట ఎండకు వాడుతోంది. పూత కాసే సమయంలో వర్షాలు రాకపోవడం రైతులకు శాపంగా మారింది.

### ఉచితంగా విత్తనాలివ్వాలి



వేరుశనగ సాగుకు గడువు అయిపోయింది. వర్షం వచ్చినా పంట పెట్టం. పంట పెట్టినా దిగుబడి రాదు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెడతాం. రాగి, ఉలవలు, కొర్రలు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తాం. ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను అందించాలి. ఉచితంగా విత్తనాలను అందించి రైతులను ఆదుకోవాలి.

– హనుమంతప్ప, శంకరగల్లు, గుడిబండ

### నెలాఖరు తర్వాత విత్తనాలు



ఈనెలాఖరు వరకూ వేరుశనగసాగు చేసుకోవచ్చు. అయినా రైతులు వేరుశనగ సాగుపై ప్రస్తుతం ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెడతాం. ఈ నెలాఖరు తర్వాత ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

### మిథున్‌రెడ్డిపై దాడికి ప్రభుత్వానిదే బాధ్యత

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప



గుడిబండ: దళితుడైన మాజీ ఎంపీ రెడ్డప్పపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడుతున్నారని తెలిసి పుంగనూరులో ఏం జరుగుతుందో తెలుసుకోనేందుకు వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించడం కూటమి పాలన దాష్టీకానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయడంతో పాటు ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. అలాగే మహానేత వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తుండటం హేయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 31 మంది దారుణ హత్యకు గురయ్యారని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, ఇలాంటి హింసాత్మక ఘటనలు పునరావృతమైతే టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

### రేపు ‘పురం’లో జేవీవీ ప్లీనరీ

హిందూపురం: స్థానిక చైతన్యనగర్‌లోని ఎస్‌ఎస్‌పీఆర్ బాలికల డిగ్రీ కళాశాలలో 21తేదీ జనవిజ్ఞాన వేదిక ప్లీనరీ నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ , జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు పాల్గొంటారన్నారు. ‘సైన్స్ సామాజిక సమస్యలను పరిష్కరిస్తుంది’ అనే అంశంపై కళాశాల విద్యార్థులతో గేయానంద్ ఇష్టాగోష్టిలో పాల్గొంటాన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

- డీసీహెచ్ తిప్పేనాయక్



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ తిప్పేనాయక్

మడకశిర: రోగులకు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ డాక్టర్ తిప్పేనాయక్ సూచించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఈ తనిఖీలో ఓ డాక్టర్ విధులకు గైర్హాజరైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సదరు డాక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు డీసీహెచ్ తిప్పేనాయక్ శుక్రవారం ఏరియా ఆస్పత్రికి వచ్చి విచారణ చేశారు. డాక్టర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. విధులకు గైర్హాజరైన డాక్టర్‌ను విచారించారు. సదరు డాక్టర్.. విధుల గైర్హాజరుపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా తిప్పేనాయక్ మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. విధులకు గైర్హాజరు కావడం తగదన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్లు, సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందించడానికి కృషి చేయాలని కోరారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ శశిరేఖ, ఆర్‌ఎంఓ దివాకర్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధానంపై దృష్టి సారించండి



సమావేశంలో పాల్గొన్న సర్పంచులు, అధికారులు

హిందూపురం అర్బన్: స్థానిక మున్సిపల్ ఆఫీసులో శుక్రవారం డీఎల్‌డీఓ సమత, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి ఆధ్వర్యంలో హిందూపురం నియోజకవర్గంలోని పంచాయతీ, మున్సిపల్ కార్యదర్శులు, సర్పంచులకు ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో ఆధార్ అనుసంధనం, ఈ-సర్వీసు, పెన్షన్ మొత్తాల రీయింబర్స్‌మెంట్‌పై చర్చించారు. అలాగే రాబోవు ఎన్నికల సమయంలో సీనియర్ సిటిజన్స్‌కు ఉపయోగపడేలా ప్రతి పంచాయతీకి ఒక వీల్‌చైర్ కొనుగోలు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారి అనుమతి ఇచ్చారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**23 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రం సేవలు**

మడకశిర: పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీ వార్డు సచివాలయంలో ఈనెల 23 నుంచి 27 వరకూ ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రంలో 0-5 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ఆధార్ నమోదు చేస్తారన్నారు. అలాగే ఈకేంద్రంలో మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు.

### పాఠశాలల తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి, ఎల్‌కే పల్లి, ఎల్‌కే పల్లివడ్రహట్టి తదితర ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నామని చెప్పారు. సకాలంలో పాఠ్యాంశాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించినట్లు పేర్కొన్నారు.

### నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. శని,ఆదివారం రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సామూహిక షిరిడీ సాయి సత్య వ్రతాలు, బంగారు పల్లకీలో బాబా ఊరేగింపు, శాంతి మహాయజ్ఞం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్వామివారికి కాకడ హారతి, గోపూజ, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, పాలాభిషేకం, తులాభారం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

### త్వరలోనే వీధిలైట్ల ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలో త్వరలో వీధిలైట్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు నగర పంచాయితీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ‘పెనుకొండలో అంధకారం’ అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ ప్రకటనలో విడుదల చేశారు. పట్టణంలో వీధి లైట్లకు సంబంధించి రూ. 10 లక్షల మేర టెండర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని, త్వరలోనే లైట్లు కొనుగోలు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## ప్రశాంతంగా మండల మీట్



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఏఓ మంజునాథ

అమరాపురం: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు తమ నివేదికను సభ్యులకు చదివి వినిపించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి మంజునాథ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యుడు నారాయణ, ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ మండలంలో వక్కతోటలు అధికంగా ఉన్నాయని, వక్క రైతులు నష్టపోతే ఎలాంటి పరిహారం రాదని, దీంతో వక్క రైతులకు సహాయం అందేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తాను రైతులకు ఏమేమి చేయాలో నివేదిక సిద్ధం చేసి ఇస్తే సంబంధిత అధికారులు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంఈఓ – 2 వెంకటరమణనాయక్ నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. తర్వాత మండల స్థాయి అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అధికారులు ప్రజల కోసం పని చేయాలన్నారు. అధికారులు బాగా పని చేస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్.ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచులు, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ వెంకటరమణనాయక్, ఏపీఓ జగదీష్, ఏపీఎం,తిప్పన్న, ఏఈ.సిద్దేశ్వర, ప్రత్యూష తదితర మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు




విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

పరిగి: రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై జరుగుతున్న ఆటవిక దాడులు, అత్యాచార ఘటనలు, హత్యలు యావత్ దేశమంతా తలదించుకునేలా చేస్తున్నాయి’ అని ఏఐఎంఎస్‌ఎస్, దాని అనుబంధ విద్యార్థి సంఘం ఏఐడీఎస్‌ఓ సంఘాల నేతలు విమర్శించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరిగిన దాడులు, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సేవా మందిరం కూడలిలో ఎన్‌లైట్ డిగ్రీ కళాశాలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐఎంఎస్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ కీర్తి మాట్లాడుతూ గడిచిన పది రోజుల్లోనే రాష్ట్రంలో ఐదుగురు చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరగడం దారుణమన్నారు. నిర్భయ, దిశ చట్టాలు అమలులో ఉన్నప్పటికీ దారుణాలు ఆగకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐడీవైఓ నాయకుడు రంగనాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్ వాడకం, అశ్లీల చిత్రాల నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

మడకశిర: పట్టణంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.

### జూనియర్ కళాశాలలో హెల్త్ క్యాంప్

గుడిబండ: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే కళాశాలలో శుక్రవారం మెడికల్ ఆఫీసర్ సౌందర్య ఆధ్వర్యంలో డయేరియాపై హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత, జ్వర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

### చదువుతోనే విజ్ఞానం

పరిగి: చదువుతోనే విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం అన్నారు. మండలంలోని నేతులపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం హిందూపురంలోని ఈశ్వర్ జువేలరీ షాప్ యజమాని శ్రీహర్ష, శ్రీవర్ష దంపతుల ఆర్థిక సౌజన్యంతో విద్యార్థులకు సమ దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహంతేష్, ఉపాధ్యాయులు హేమలత, కళావతి, శాసనకోట హెచ్‌ఎం ఆనందరాజు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రికార్డుల పరిశీలన

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని ఎంఈఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం ఆయన వైసీపీ తండా, చాపార్లపల్లి, సీ కొడిగేపల్లి గ్రామాల్లో పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

### గుంతపల్లిలో ఉట్ల పరుష



ఉట్లమాను దగ్గర సందడి

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉట్ల పరుష సందడిగా సాగింది. ముందుగా ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు ఉట్ల పరుష నిర్వహించారు. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు.

### శేషసాయి సంస్థాన్‌లో హోమాలు

హిందూపురం: హిందూపురం సత్యనారాయణపేటలో వెలసిన షిర్డి శేష సాయి సంస్థాన్ మందిరంలో గురుపూర్ణిమను ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 20న 108 ముత్తైదువులతో 108 రకాల నైవేద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 21న సాయి నాథుడికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

### ఘనంగా ఆంజనేయస్వామి ఊరేగింపు



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా పరిధిలోని అరసికెరెలో వెలసిన గుజ్జారి ఆంజనేయస్వామి జాతరలో భాగంగా శుక్రవారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున హారతుల ఉత్సవం నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నైవేద్యంగా ఉంచిన 101 తళిగలను దాసప్పలకు వితరణ చేశారు.



పావగడ తాలూకా వైఎన్ హొసకోట గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలో పీర్ల స్వాములను జలధికి తరలిస్తున్న దృశ్యం



సోమందేపల్లిలో జలధికి తరలివెళ్తున్న పీర్లు

## ముగిసిన మొహర్రం

పరిగి/సోమందేపల్లి/పావగడ: మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పరిగి, సోమందేపల్లి, పావగడ ప్రాంతాల్లో జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం పీర్ల చావిడి ముందు ప్రత్యేక ప్రార్థనల తర్వాత జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.